నోరు మెదపరేం..?

- 20 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి అంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన చంద్రబాబు అండ్ కో
- ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇస్తామని హామీ
- అధికారంలోకి వచ్చాక నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్‌పై నోరు విప్పని కూటమి ప్రభుత్వం
- తాజా కేబినెట్ సమావేశంలో ఆ ప్రస్తావనే లేదు
- స్పష్టమైన ప్రకటన చేయాలని నిరుద్యోగులు డిమాండ్



దత్తిరాజేరు: 'రాష్ట్రంలో యువశక్తికి కొదువ లేదు.. ఏపీలో యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తాం..పరిశ్రమలు తెస్తాం..తాము అధికారంలోకి వస్తే రాబోయే అయిదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.. అంతే కాదు మీకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇస్తా...ఎంత తమ్ముళ్లా.. ఎంత..? 3 వేల రూపాయలు ఇస్తా... ఏం తమ్ముళ్లా బాగుందా.. అదిరిపోయిందా' అంటూ 2023లో నిర్వహించిన టీడీపీ మహానాడు సభలో ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు చెప్పిన మాటలివి. ఆతర్వాత టీడీపీ,జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేశాయి. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ కూటమి నాయకులు ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటించారు. నిరుద్యోగ యువతను ఆకర్షించేందుకు ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఏటా నాలుగు లక్షలు చొప్పున అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని.. ఉద్యోగం రాని ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, లోకేష్‌తో పాటు కూటమి నాయకులు ప్రతీ సమావేశంలో ఊదర గొట్టారు. వీరి ప్రకటనలకు యువత పెద్ద ఎత్తున ఆకర్షితులయ్యారు. ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ప్రభుత్వం ఏర్పడి నెల దాటుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఈ హామీల ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో ప్రకటించడం లేదు. నిరుద్యోగ భృతి హామీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడకపోవడంపై నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారు.తాజాగా మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ ఈ అంశం చర్చకు రాలేదు. ఇలా అయితే పథకానికి సంబంధించిన విధి విధానాలు రూపొందించేదెప్పుడు..? అమలు చేసేది ఎప్పుడని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తున్నారు. 2014లో ఇలాగే ఇంటికో ఉద్యోగం , రూ.2వేల నిరుద్యోగ భృతి అని హామీ ఇచ్చి చంద్రబాబునాయుడు మోసం చేశారని, మళ్లీ అదే పునరావృతమవుతుందేమోనని పలువురు నిరుద్యోగులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల పరిధిలో ఇంటర్,డిప్లమో, డిగ్రీ ఆపై చదువులు చదివిన సుమారు.65 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు.

ఎప్పుడు ఇస్తారో చెప్పాలి..



ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం నిరుద్యోగభృతి ఇవ్వాల్సిందే. ఎప్పటి నుంచి నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తారో ప్రభుత్వం ప్రకటన చేయాలి. పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నిరుద్యోగభృతి ఇవ్వాలి. జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేయాలి. చంద్రబాబు హామీలు అమలు చేస్తారనే నమ్మకం లేదు. ఆ అనుమానాలను తొలగించి త్వరగా నిరుద్యోగ భృతి అందజేయాలి.

– బి.శంకరరావు, దత్తిరాజేరు

మాట నిలబెట్టుకోవాలి



ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇస్తామని కూటమి నేతలు ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవాలి. కాలయాపన చేయకుండా నిరుద్యోగ భృతి అందించాలి. అలాగే ఉద్యోగాల కల్పన, జాబ్‌క్యాలెండర్ హామీలకు కట్టుబడి ఉండాలి.

– కె.భార్గవ్, గదబవలస, దత్తిరాజేరు మండలం

మరోసారి మోసగించొద్దు



కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల గడుస్తున్నా నిరుద్యోగ భృతి గురించి ప్రకటన చేయలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యో గులకు భృతి అందజేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. 2014లో ఇలాగే ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారు. మళ్లీ యువతను మోసగించొద్దు. నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి.

– పప్పల లక్షణరావు కొనిశ, గజపతినగరం మండలం

ఉద్యోగాలు కల్పించాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగాలు కల్పించాలి. లేకుంటే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి ఇవ్వాలి. ప్రభుత్వం ఏర్ప డి నెలరోజులు పూర్తయింది. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై స్పష్టత రాలేదు. కోచింగ్‌లకు వెళ్లేందుకు నిరుద్యోగులు ఇబ్బందిపడకుండా భృతి చెల్లించాలి.

– బోదసింగి రఘురాం, బోదసింగిపేట, బొండపల్లి మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే..



కూటమి ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగభృతి పథకాన్ని అమలు చేయాలి.గతంలో ఇదే మాదిరిగా హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువతను మాయ చేశారు. ఈసారి అలా చేస్తే యువత ఉద్యమిస్తారు. జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేయాలి.

– సంగం రెడ్డి మహేష్, గజపతినగరం మండలం.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు అభినందన



హెచ్‌ఎం పద్మావతిని సత్కరిస్తున్న భీశెట్టి బాబ్జీ, తదితరులు

జామి: మండలంలోని కుమరాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అభినందించారు. 2023–24 విద్యా సంవత్సరంలో పాఠశాలలో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో 17 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.ఈసందర్భంగా భీశెట్టి బాబ్జీతో పాటు జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, పౌరవేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు తదితరులు మంగళవారం పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం సీహెచ్.పద్మావతిని సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ప్రతిష్టను రాష్ట్రస్థాయికి తీసుకువెళ్లిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పెదమానాపురం ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఉన్నత పాఠశాలలో 2006- 07లో పదోతరగతి చదు వుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ నం ఆపాఠశాల వేదికగా మంగళవారం జరిగింది. ఇక్కడ చదువు పూర్తయిన తర్వాత ఉన్నత చదువుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లి, వేర్వేరు రంగాల్లో స్థిరపడిన వారంతా 17ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. మిత్రులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.అనంతరం అప్పటిలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు బహుకరిస్తున్న ఏఎస్ఐ రెహమాన్

కొత్తవలస: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కొత్తవలస ఏఎస్‌ఐలు రెహమాన్, జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం ఇన్వెస్టిచర్ సెర్మనీ నిర్వహించారు. అతిథులుగా హాజరైన ఏఎస్ఐలు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు పూర్తిగా లోపించాయని, ఫలితంగా పిల్లలు కూడా నేరాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని సూచించారు.అనంతరం విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు బహూకరించారు.రవీంద్ర భారతి పాఠశాలల నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, ఉపాధ్యాయులు బి.సంతోష్‌కుమార్,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

శృంగవరపుకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏ.ఏ.సాంబశివరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ సొండి సోమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు అంతా హాజరు కావాలని కోరారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

గుర్ల: పని ప్రదేశాల్లో, ఇళ్లలో, ప్రయాణాల్లో ఎక్కడైనా మహిళలపై ఎవరైనా లైగింక వేధింపులకు పాల్పడినా, అసభ్యకరంగా ప్రవర్తించినా కొత్త చట్టాల ప్రకారం కఠిన శిక్షలు తప్పవని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోమండల మహిళా నోడల్ అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. పని ప్రదేశాల్లో మహిళలపై దాడులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం తో పాటు, మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే కమిటీలు ప్రతీ చోట ఉండాలని చెప్పారు. తహసీల్దార్ రమాదేవి, ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోండి

- అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- తహసీల్దార్ ఎదుట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



ఆధారాలతో సహా తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగడం మాను కోవాలని, లేదంటే వైఎస్సార్ సీపీ ఆధ్వ ర్యంలో గట్టిగా ఎదురుతిరగడం తప్పదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం స్పష్టం చేశారు. మండలంలోని గొల్లల ములగాం చౌకదుకాణం డీలర్‌పై అన్యాయంగా కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ ఎస్.ప్రసాద్‌ను ప్రశ్నించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చౌకదుకాణాలకు సంబంధించిన ఈ–పాస్ యంత్రాలు మరమ్మతులకు గురైన నేపథ్యంలో రేషన్ సరుకులు పంపించి డీలర్ అనుమతి లేకుండా, ఈ–పాస్ యంత్రంలో వేలిముద్ర వేయకుండానే సరుకులు దింపడం వెనుక ఎవరి హస్తముందని ప్రశ్నించారు. రేషన్ సరుకులు దింపడం, ఆ వెంటనే పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ వచ్చి సరుకులు ఎలా వచ్చాయంటూ కేసు నమోదు చేయడం చూస్తుంటే అధికారులే అడ్డదారులు తొక్కుతున్నట్లు అనిపిస్తోందన్నారు. బలవంతంగా సరుకులు దింపడం, వెనుక నుంచి వచ్చి కేసులు నమోదు చేయడం అన్యాయ మన్నారు.నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులే ఇలా ఒకవైపు కొమ్ము కాసి పని చేస్తే సహించేది లేదని, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ సమాధానం చెప్పే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం. దీంతో తహసీల్దార్ ప్రసాదరావు పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ పిన్నింటి రామారావు కు ఫోన్ చేయగా ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. అన్యాయంగా కేసులు నమోదు చేయడం దారుణమని, ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్‌కు తెలి పారు. మరికొన్ని గ్రామాల్లో కూడా ఇదే తరహాలో తప్పుడు కేసులు నమోదు చేస్తున్న నేపథ్యంలో త్వరలో దీనిపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాల నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పతివాడ రాజారావు, నాయకు లు రఘుమండ త్రినాథ్, రేవల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఏపీజీఈఏ సభ్యత్వ నమోదు



మెరకముడిదాం ఎంపీడీఓతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఏపీజీఈఏ సంఘ బాధ్యులు

చీపురుపల్లి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోందని ఆసంఘం అధ్యక్షుడు పిన్నింటి హరి చెప్పారు. సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలంలో మంగళవారం ప్రారంభించారు. గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు సభ్యత్వ నమోదుకు ముందుకొచ్చారని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీజీఈఏ ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తోందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటే సంఘంలో అత్యధికంగా సభ్యత్వాలు నమోదు ఉండాలన్నారు. అందుకనే ఉద్యోగులంతా ఏపీజీఈఏ సంఘంలో చేరాలని కోరారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ, జిల్లా సంయుక్త కార్యదర్శి గిడిజాల లక్ష్మునాయుడు, గౌరవ అధ్యక్షుడు కర్రోతు విశ్వేశ్వరరావు, మండల కార్యదర్శి చిప్పాడ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు జి.సూర్యకుమారి, ఆర్.ఎల్.వరప్రసాద్, ఎల్.రామమోహన్, ఎస్.ఈశ్వరరావు, కె.యశోద తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రుణాలు ఇప్పించండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

శృంగవరపుకోట: అవసరం మేరకు డ్వాక్రా పొదుపు సంఘాలకు అంతర్గత రుణాలు ఇవ్వాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కల్యాణ చక్రవర్తి బ్యాంకర్లను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్.కోట, జామి, ఎల్.కోట మండలాల బ్యాంకు మేనేజర్లు, ఐకేపీ సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి సంఘానికి అంతర్గత రుణాలు ఇవ్వాలని, అవసరం మేరకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బ్యాంకులకు వచ్చే మహిళలకు మర్యాద, మన్నన, గౌరవమిచ్చి వాళ్ల పనులు త్వరగా పూర్తిచేసి పంపేలా చూడాలని ఆయన బ్యాంకర్లను కోరారు. ఆయా మండలాల ఎంపీడీఓలు, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఎస్.ఆదియ్య, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరుకున్న యూనిఫాం మెటీరియల్

గజపతినగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సమకూర్చిన యూనిఫాం దుస్తుల మెటీరియల్ స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి మంగళవారం చేరుకున్నాయి. ఎంఈఓ విమలమ్మ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి మూడుజతల యూనిఫామ్ క్లాత్ అందిస్తామని చెప్పారు.55 పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 3,836మంది విద్యార్థులకు వీటిని అందజేయనున్నామని, త్వరలో అన్ని పాఠశాలలకు వీటిని పంపిస్తామని చెప్పారు. మంగళవా రం పలు పాఠశాలల ఉపాధ్యాయులకు యూనిఫాం మెటీరియల్‌ను సీఆర్పీ రామసూరిరెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది అందజేశారు.

భారీ వర్షం

గజపతినగరం: మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో రోడ్లు జలమయమయ్యాయి. పురిటిపెంట, పురిటిపెంట న్యూకాలనీ,మెంటాడ జంక్షన్ తదితర ప్రాంతాల్లో వరద నీరు ఎక్కడికక్కడ స్తంభించి పోవడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. వరినారు ఎండిపోతున్న సమయంలో భారీవర్షం కురవడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వరి నారుకు ఊపిరి

వేపాడ: మండలంలో వర్షాలు లేక ఖరీఫ్ వరినారు మడులు ఎండిపోతున్నాయి. ఈ తరుణంలో మంగళవారం కురిసిన వర్షం వరినారుకు ఊపిరి పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రైతులు 20 రోజుల క్రితమే వరినారు పోశారు. వర్షాలు లేకపోవడంతో చెరువుల్లో నీటిని ఇంజిన్‌ల సహా యంతో తోడుకుని వరినారు కాపాడుకున్నారు. ఈ సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



పోలీస్ బందోబస్తు మధ్య విచారణ చేస్తున్న ఎస్.కోట ఏపీడీ శారదాదేవి

గుర్ల: మండలంలోని పాలవలసకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రామానికి చెందిన వేతనదారులు గత నెలలో అప్పటి కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. వేతనదారుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఉపాధి హామీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అప్పటిలో అధికారులు విచా రణ చేపట్టలేదు. ఆతర్వాత కలెక్టర్ నాగలక్ష్మికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో జిల్లా కలెక్టర్‌గా వచ్చిన అంబేడ్కర్ ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని ఆదేశిస్తూ, తహసీల్దార్ రమాదేవిని విచారణ అధికారిగా నియమించారు. ఈనెల 9న పాల వలస సచివాలయంలో తహసీల్దార్ విచారణ చేపట్టారు. కానీ నేటికి నివేదికను కలెక్టర్‌కు అందించలేదని సమాచారం. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఎస్.కోట ఉపాధి హామీ ఏపీడీ శారదాదేవి పాలవలసలో మంగళవారం విచారణ చేపట్టారు. అయితే ఈ విచారణకు తమను హాజరు కాకుండా చేసేందుకు కూటమి నేతలు విఫలయత్నం చేశారని, పోలీసులను భారీగా గ్రామంలో దించి భయభ్రాంతులకు గురుచేశారని వేతన దారులు ఆరోపించారు. అయినప్పటికీ వేతనదారులు విచారణకు హాజరయ్యారు. పోలీసు బందోబస్తు మధ్య అధికారులు విచారణ చేశారు. వారానికి రూ.50 నగదుచెల్లించాలని, కొత్త జాబ్ కార్డుకు రూ.500 ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ తమను డిమాండ్ చేస్తున్నారని, మాట వినని వారి జాబ్ కార్డులు తొలగిస్తామని భయపెడుతున్నట్లు వేతనదారులు అధికారులకు చెప్పారు. మాట వినకుంటే ఇష్టం వచ్చినట్లు దుర్భాషలు ఆడేవాడని వాంగ్మూలం ఇచ్చారు. విచారణ నివేదికను గత అధికారులు చేసిన విచారణ నివేదిక కంటే ముందుగా కలెక్టర్‌కు అందించాలని వేతనదారులు కోరారు. ఏపీఓ కామేశ్వరరావు, జిల్లా ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

సందడే..సందడి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

వేపాడ: బక్కునాయుడుపేట గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ యు.ఉషారాణి ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే సంబరాలు మంగళవారం నిర్వహించారు. పాఠశాలలో కొత్తగా జాయిన్ అయిన 5,6,7,8,9 తరగతులు, ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి నులకు స్వాగతం పలికారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు నృత్యప్రదర్శనలు, ఆట పాటలతో సందడి చేశారు.

లెప్రసీ నిర్మూలన దిశగా...



కొత్తవలస మండలం వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

- రేపటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



గంట్యాడలో మాట్లాడుతున్న డాక్టర్ హేమలత



కొత్తవలసలో వైద్యసిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సీతల్‌వర్మ



దత్తిరాజేరు మండలం కె.కొత్తవలస పీహెచ్‌సీలో శిక్షణ ఇస్తున్న డాక్టర్ స్రవంతి



బొండపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గంట్యాడ/కొత్తవలస/దత్తిరాజేరు/బొండపల్లి: లెప్రసీ(కుష్టు వ్యాధి) నిర్మూలనకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది కృషి చేయాలని పీహెచ్‌సీల వైద్యాధికారులు కోరారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్-2024పై గంట్యాడ, కొత్తవలస, దత్తిరాజేరు, బొండపల్లి పీహెచ్‌సీల్లో ఏఎన్‌ఎం లు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బందితో వైద్యాధికారులు హేమలత, వెంకటేష్, సీతల్‌వర్మ, గోపాలకృష్ణ, స్రవంతి,ఆనంద్‌కుమార్, ఎల్.సత్యనారాయణ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింట సర్వే చేసి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు.వ్యాధిగ్రస్తులను గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగి, గోదుమరంగులో మచ్చలు ఉంటే అవి కుష్టు వ్యాధి లక్షణాలని, అలాంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, పేర్లు నమోదు చేయాలని చెప్పారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి పీహెచ్‌సీలో మరోమారు పరీక్షలు ప్రత్యేక వైద్యసేవలు, ఉచితంగా మందులు అందించనున్న ట్లు చెప్పారు.రోజూ 20 నుంచి 25 ఇళ్లను సర్వే చేయాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న వన్ స్టాఫ్ సెంటర్ కౌన్సిలర్ రమాదేవి

గంట్యాడ: బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కిల్లాడ రమా దేవి అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.గృహహింసకు, వరకట్న వేధింపులకు గురయ్యే మహిళలు ట్రోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని చెప్పారు.కేస్ వర్కర్ టి.అనిత, కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.